**నేటి కందం- నేటికి అందం**

ద్యాభివృద్ధి చేయగ
విద్యార్థుల పట్ల మిగుల ప్రీతిని జూపన్
"విద్యా వారోత్సవ"మను
పద్యను జేపట్టె ప్రభుత పంచారముగాన్ !!

(విద్యా ప్రమాణాలు పెంచలనే ఉద్దేశంతో తెలంగాణా లో రాష్ట్ర ప్రభుత్వం విద్యావారోత్సవాలను చేపట్టింది.)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**చురక**

నేతలెవరికైనా ఉందా
నెహ్రూ చరిష్మా విజన్
విమర్శిస్తే చేరుతారా
విలువల్లో అతని వజన్.
ప్రాజెక్టులు పరిశ్రమలు
ప్రతి ఒక్కటి అతని చలువ
ప్రగతి స్ఫూర్తి ప్రజాస్వామ్య
పరిపాలనకతడు నిలువ



-వేల్పుల నారాయణ
9440433475


హైదరాబాద్ బుధవారం 13-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:216 పేజీలు:6 వెల: రూ.1/-


## పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి.. 8 మంది మృతి.. 35 మందికి గాయాలు.. ఎమర్జెన్సీ అలర్ట్



న్యూఢిల్లీ, మే 12:పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఆటో రిక్షా ద్వారా జరిగిన ఈ ఆత్మాహుతి దాడిలో 8 మంది మరణించగా, 35 మందికిపైగా గాయపడ్డారు. పాకిస్తాన్ వాయువ్య ప్రాంతం, ఖైబర్ పక్తుంఖ్వా పరిధిలోని లక్కి మార్వాట్ జిల్లాలో మంగళవారం ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ప్రాంతంలో మిలిటరీ కదలికలు ఎక్కువగా ఉన్నప్పటికీ దాడి జరగడం విశేషం.

అక్కడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలు పేలుడు పదార్థాలు కలిగిన ఆటో రిక్షా ఒకటి నౌరంగ్ బజార్ ప్రాంతంలోని ఫట్టాక్ చౌక్ ప్రాంతంలోకి దూసుకొచ్చి, పేలిపోయింది. ఆటోలోని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో 8 మంది మరణించగా, 35 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు కూడా ఉన్నారు. వారిలో ఒక మహిళా అధికారి కూడా ఉంది. ఘటన గురించి తెలుసుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రుల్ని స్థానిక సరాయ్ నౌరంగ్ పరిధిలోని ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించారు.

బాధితుల చికిత్స కోసం అధికారులు స్థానిక ఆస్పత్రుల్లో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. దీనిలో భాగంగా వైద్యులు, సిబ్బంది సెలవులు రద్దు చేసి, వెంటనే ఆస్పత్రికి రప్పించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు. రెండు రోజుల క్రితం కూడా పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఒక చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడిలో దాదాపు 15 మంది పోలీసులు మరణించారు.

# మోదీ పిలుపుతో ఇంధన పొదుపుకు సరికొత్త బాట

**-సైకిల్‌పై కోర్టుకు వెళ్లిన హైకోర్టు న్యాయమూర్తి**
**-మెట్రో, ఈ-రిక్షాలో ప్రయాణించిన ఢిల్లీ మంత్రి**
**-ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపుకు స్పందన**
**-ప్రజా రవాణాతో ఆదర్శంగా నిలుస్తున్న ప్రముఖులు**



న్యూఢిల్లీ, మే 12: దేశ వ్యాప్తంగా ఇంధనాన్ని పొదుపు చేయాలనే సందేశం గట్టిగా వినిపిస్తుంది. ముఖ్యంగా కీలక పదవుల్లో ఉన్న వ్యక్తులు స్వయంగా రంగంలోకి దిగి సమాజానికి మార్గదర్శనం చేస్తున్నారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా భావించి, విలాస వంతమైన అధికారిక వాహనా లను పక్కన పెట్టి సామాన్యుల బాటలో నడుస్తున్నారు. పశ్చిమా సియా సంక్షోభం నేపథ్యంలో ఇంధనాన్ని ఆదా చేయాలన్న ప్రధానమంత్రి పిలుపును స్ఫూర్తి గా తీసుకున్న ఢిల్లీ మంత్రి ఆశిష్ సూద్ , మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ద్వారకా దీశ్ బన్సల్ తమ చర్యల ద్వారా దేశవ్యా ప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు.

**సైకిల్‌పై కోర్టుకు న్యాయమూర్తి..**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ సంక్షోభం నేపథ్యంలో ఇంధనాన్ని ఆదా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ పిలుపును మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ద్వారకా దీశ్ బన్సల్ మనస్ఫూర్తిగా స్వాగతించారు. ఇంధనాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో ఆయన తన అధికారిక వాహనాన్ని పక్కన పెట్టారు. తన నివాసం నుండి కోర్టు వరకు ఉన్న సుమారు 3 కిలోమీటర్ల దూరాన్ని ఆయన సైకిల్‌పైనే ప్రయాణించి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జస్టిస్ బన్సల్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇప్పుడు సోషల్ మీడియాలో న్యాయ వర్గాల్లో ప్రశంసల జల్లు కురుస్తోంది.

మెట్రో, ఈ-రిక్షాలో ఢిల్లీ విద్యాశాఖ మంత్రి

మరోవైపు, ఢిల్లీ విద్యాశాఖ మంత్రి ఆశిష్ సూద్ కూడా తన నిరాడంబరతతో ఆదర్శంగా నిలిచారు. ప్రధాని పిలుపునిచ్చిన పొదుపు చర్యల్లో భాగంగా ఆయన ప్రజా రవాణా వ్యవస్థను ఎంచుకున్నారు. సూరజ్‌మల్ విహార్‌లోని సి.ఎం. శ్రీ పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల కీలక సమావేశానికి హాజరయ్యేందుకు ఆయన ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. మెట్రో స్టేషన్ నుండి పాఠశాల వరకు చేరుకోవడానికి ఆయన ఈ-రిక్షాను వినియోగించారు. సాధారణంగా మంత్రులు భారీ కాన్వాయ్‌లతో వెళ్లే క్రమంలో, ఆశిష్ సూద్ ఇలా సామాన్యుడిలా ప్రయాణించడం చర్చనీయాంశమైంది.

# వరి కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

హైదరాబాద్, మే 12: రబీ వరి కొనుగోళ్లపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మధ్యంతర గోదాములకు క్వింటాల్‌కు రూ.17 హ్యాండ్లింగ్ ఛార్జీలు, వరి అన్‌లోడింగ్ హమాలీ ఛార్జీలు రూ.6.50 నుంచి రూ.8.50కి పెంచింది. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములు, మిల్లులకు వేగంగా ధాన్యం తరలింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా వరి కొనుగోళ్లకు అంతరాయం లేకుండా కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. రబీ 2025-26 సీజన్‌కు ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి రానున్నాయి.

ఈరోజు(మంగళవారం) జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వాకిటి శ్రీహరి, సీఎస్ రామకృష్ణరావు హాజరయ్యారు. అన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న సమస్యలు, జిల్లాల్లో ఉన్న పరిస్థితులు, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ల నుంచి సీఎం ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ముఖ్యమంత్రి కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం సేకరణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకూడదన్నారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చూడాలని సూచించారు. లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# మంత్రి పొన్నం వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, మే 12: తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఈరోజు (మంగళవారం) గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు.

పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని అన్నారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని అన్నారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు.

'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం.. అని ప్రశ్నించారు. మైనర్ బాలిక కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, కాంగ్రెస్ బాధితురాలికి అండగా నిలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# రెండేళ్ల నిషేధంపై కేంద్రం ఆలోచన

న్యూ ఢిల్లీ, మే 12:పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం, దిగుమతి ధరల పెరుగుదల, నిర్మాణ వ్యయాలు అధికమవుతున్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా భారీ నిర్మాణ పనులను రెండేళ్ల పాటు నిలిపివేయాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభుత్వానికి కీలక సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనపై కేంద్రం కూడా సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఇంధన ధరలు, దిగుమతి వ్యయాలు అధికమవడంతో పెద్ద ప్రాజెక్టుల అమలు భారంగా మారుతున్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో భారీ నిర్మాణ ప్రాజెక్టులను తాత్కాలికంగా నిలిపివేయాలని నీతి ఆయోగ్ సూచించినట్లు సమాచారం.

నీతి ఆయోగ్ సిఫార్సుల నేపథ్యంలో సెంట్రల్ సెక్రటేరియట్ పునర్నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. దేశ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అవసరమైన ప్రాజెక్టులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# రెండోసారి అస్సాం సీఎంగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం



గౌహతి, మే 12: అస్సాం ముఖ్యమంత్రిగా ఇవాళ హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టడం వరుసగా ఇది రెండోసారి. ఆ రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అస్సాంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వరుసగా ఇది మూడోసారి. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. బీజేపీ నేత రామేశ్వర్ తేలి మంత్రిగా ప్రమాణం చేశారు. బీజేపీ కూటమికి చెందిన ఏజీపీ పార్టీ నేత అతుల్ బోరా, బీపీఎఫ్‌కు చెందిన చరణ్ బోరాలు కూడా ఇవాళ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎన్డీఏ బృందానికి 102 సీట్లు వచ్చాయి. అస్సాం అసెంబ్లీలో 126 మంది సభ్యులు ఉండగా, దాంట్లో బీజేపీ 82 స్థానాలను చేజిక్కించుకున్నది. ఏజీపీ, బీపీఎఫ్ పార్టీలు చెరి పది సీట్లు గెలుచుకున్నాయి.

# నీట్ పరీక్ష రద్దుపై కేంద్రం బాధ్యత వహించాలి: ఎంపీ చామల కిరణ్ రెడ్డి



హైదరాబాద్, మే 12: దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, కేంద్ర మానవ వనరుల శాఖ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు.దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించా లన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలి పారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపిం చాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# రెయిన్ అలర్ట్.. కోస్తా జిల్లాల్లో ఐదు రోజులపాటు వర్షాలు..

హైదరాబాద్, మే 12:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కోస్తా జిల్లాల్లో వచ్చే ఐదు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రాయలసీమ నుంచి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి విస్తరించి ఉందని అధికారులు చెప్పారు.

మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉదయం 8:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఐఎండీ తెలిపింది. ఇది సముద్ర మట్టానికి సగటున 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని వెల్లడించింది. ఇది రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి ప్రాంతం కాకుండా మిగిలిన బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలో వాతావరణం సాధారణంగా ఉంటుందని చెప్పింది. ఈ వారం చివరి నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఐఎండీ తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేసింది.

# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం.. వాహనాల దగ్ధం

సంగారెడ్డి జిల్లా, మే 12 : సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**వాహనాల గోడౌన్‌లో మంటలు..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం.

**ప్రమాద కారణాలపై ఆరా..**

అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణ నర్సులకు జర్మనీలో ఉపాధి కల్పిస్తాం: మంత్రి వివేక్

హైదరాబాద్, మే 12:తెలంగాణ రాష్ట్రంలోని నర్సులకు విదేశాల్లో ముఖ్యంగా జర్మనీలో అద్భుతమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక సమావేశంలో 'ట్రిపుల్ విన్' ప్రోగ్రాం వివరాలను వెల్లడించారు. ఈ ప్రోగ్రాం కింద శిక్షణ పొందిన సుమారు 79 మంది నర్సులు త్వరలోనే జర్మనీకి వెళ్లనున్నారని తెలిపారు. జర్మనీలో రోగులతో సంభాషించడానికి జర్మన్ భాష అత్యంత అవసరమని, అందుకే నర్సులకు '2' స్థాయి వరకు భాషా శిక్షణ ఇప్పిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు.

ముఖ్యమంత్రి విదేశీ విద్యానిధి కింద, అభ్యర్థుల వీసా, ఇతర ఖర్చులపై ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అందిస్తోందని హామీ ఇచ్చారు. ఏజెంట్ల చేతిలో మోసపోకుండా, ప్రభుత్వ సంస్థ అయిన 'టామ్‌కామ్' ద్వారా ఈ నియామకాలు పారదర్శకంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, శిక్షణ పొందిన విద్యార్థులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శిక్షణలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

# నేను జైలుకు వెళ్లా: తెలంగాణ గవర్నర్

హైదరాబాద్, మే 12: స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు.

గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు.

# ఈ 14న ప్రజా దర్బార్ : ఈఎంసీ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం మే 12 : ఈ నెల 14వ తేదీన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టివి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా ఏదులాపురంలో తొలిసారిగా ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

# ఇంజనీర్ల కృషితో సాంకేతిక డిజిటల్ విప్లవం

## (13 మే “ఐఈఈఈ గ్లోబల్ ఇంజనీరింగ్ దినోత్సవం” సందర్భంగా)

ప్రపంచ మానవాళి సరళ జీవన విధానానికి గట్టి పునాదులు వేస్తున్న ఇంజనీర్ల సేవలను గుర్తించడంతో పాటు వారి ఆధునిక ఆవిష్కరణలను ఆకళింపు చేసుకోవడానికి ఉద్దేశించబడిన వేదికలుగా ప్రతి ఏటా 13 మే రోజున ప్రపంచవ్యాప్తంగా “ఐఈఈఈ గ్లోబల్ ఇంజనీరింగ్ దినోత్సవం” పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచంలోనే అతి పెద్ద సాంకేతిక నిపుణులతో కూడిన సంస్థగా 160 దేశాల్లో విస్తరించి 3.5 లక్షల సభ్యులతో “ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ)” 1973లో అవతరించి అప్రతిహతంగా కొనసాగుతున్నది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ లాంటి ఇంజనీరింగ్ విభాగాల్లో యువత పెద్ద ఎత్తున ప్రవేశించి, ఆయా రంగాల్లో విశేష కృషి జరపాలనే లక్ష్యంతో ఈ దినోత్సవం వేడుకగా జరుపుకుంటున్నాం.

### ఇంజనీరింగ్ అద్భుత ఆవిష్కరణలు:

చేతిలో వైకుంఠాన్ని చూపుతున్న స్మార్ట్‌ఫోన్లు, అతి పెద్ద ఆకాశహర్మ్యాలు, అంతరిక్ష ప్రయాణాలు, అత్యాధునిక విమానాశ్రయాలు, డ్రోన్ టెక్నాలజీ ఫోటోగ్రఫీలు లాంటి అనేక విప్లవాత్మక మార్పులకు ఇంజనీర్లు పునాదులు వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సృజనశీల ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇంజనీరింగ్ సంబంధ విద్యార్థులు, అధ్యాపకులు, టెక్నోక్రాట్లు, నిపుణులు, పరిశోధకులను ఏకం చేసి మెరుగైన సాంకేతికతను సుసాధ్యం చేయడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. సుస్థిర సమాజ నిర్మాణం కోసం ఇంజనీర్లు చేస్తున్న కృషిని ప్రశంసించడానికి మార్చి 3 – 5 రోజుల్లో “ప్రపంచ ఇంజనీర్ల దినం”' జూన్ 23 – జూలై 07 వరకు “ఐఈఈఈ మహిళా ఇంజనీర్ల దినం” కూడా పాటించడం జరుగుతోంది.

### మానవ కేంద్రిత ఇంజనీరింగ్ విద్య :

ఆవిష్కరణలు, డిజిటలైజేషన్ ద్వారా సుస్థిర భవిష్యత్తు కోసం స్మార్ట్ ఇంజనీరింగ్ అనుసంధానం చేస్తున్న తీరు అనన్యసామాన్యం. సుస్థిరాభివృద్ధి సాధనలో ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది. ఇంజనీరింగ్ అభివృద్ధికి బేషరతుగా మద్దతు ఇవ్వడానికి, వారిని పౌర సమాజం సముచితంగా గుర్తించడానికి అన్ని ప్రయత్నాలు నిరంతరం జరగాలి. 2026లో 17వ ఐఈఈఈ గ్లోబల్ సదస్సు “ఎడ్యుకాన్” పేరుతో నిర్వహించడానికి “మానవ కేంద్రిత ఇంజనీరింగ్ విద్య : సుస్థిర ఆవిష్కరణలు, ఏఐ – డిజిటట్ మార్పులకు మానవీయ నాయకత్వాలను శక్తివంతం చేయడం” అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేటి యువత సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్/ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్ రంగాల్లో (స్టెమ్ – ఎస్‌టిఈఎం) ముందుకు వస్తేనే మానవాళి అభివృద్ధి సుసాధ్యం అవుతుందని గమనించాలి.

శాస్త్ర సాంకేతిక శాస్త్ర పరిశోధనలతో నేటి ఏఐ డిజిటల్ ప్రపంచం మరో లోకంలోకి ప్రవేశిస్తున్నది. వీటి పుణ్యాన భూమి కుగ్రామంగా మారింది. దూరాలు, సరిహద్దులు చెరిగి పోయాయి.

అరచేతిలో స్మార్ట్ వైకుంఠం వెలసింది. మితిమీరిన టెక్నాలజీ రీతులతో యువత కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఆధునిక ఏఐ–డిజిటల్ టెక్నాలజీ కత్తికి రెండు వైపులా పదును పెరుగుతోంది. టెక్నాలజీతో ప్రయోజనంతో పాటు దురుపయోగం కూడా జరుగుతోంది. కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీతో మానవాళి సుస్థిరాభివృద్ధి దిశగా మాత్రమే అడుగులు వేయాలని, ప్రపంచ శాంతికి పునాదులు జరగాలని కోరుకుందాం, నేటి యువతను ఇంజనీరింగ్ విద్యలోకి ప్రవేశించే విధంగా ప్రయత్నాలు చేద్దాం.



-మధుపాళీ
9949700037

# గుజరాత్‌లోని సోమనాథ ఆలయ పునరుద్ధరణకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా

# నిర్వహించిన సోమనాథ అమృత మహోత్సవంలో పాల్గొన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూ ఢిల్లీ, మే 12: గుజరాత్‌లోని సోమనాథ ఆలయ పునరుద్ధరణానంతర ప్రతిష్ఠాపనోత్సవానికి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ఇవాళ నిర్వహించిన అమృత మహోత్సవంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ సభనుద్దేశించి ప్రసంగిస్తూ- ఈ వేడుక లాంఛనప్రాయ ఉత్సవం కాదని, ఇది భారతీయ శాశ్వత చైతన్యానికి, నాగరికతా పునరుత్థానానికి ప్రతీక అని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రక సందర్భంలో వేద మంత్రాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సముద్రపు అలల ఘోష ముప్పేటగా పవిత్ర ప్రదేశ పునరుద్ధరణ సందర్భానికి మరింత శోభను జోడిస్తే, భక్తిపురస్సర జాతీయ ప్రతిష్ఠ సగర్వంగా తలెత్తుకు నిలిచింది.

దైవ సంకల్పం నుంచి ఉద్భవించిన ఈ సృష్టి తిరిగి అందులోనే లీనమయ్యే తీరును ప్రధానమంత్రి వివరిస్తూ- “యతో జాయతే పాల్యతే యేన విశ్వం, తమిశం భజే లీయతే యత్ర విశ్వం” అని శివస్తోత్రంలోని ప్రాచీన శ్లోకాన్ని ఆయన ఉటంకించారు. “అదే తరహాలో ఈ రోజున మనం ఆ మహదేవుని ఆవాన పునర్నిర్మాణోత్సవం నిర్వహించుకుంటున్నాం” అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. వ్యక్తిగతంగా తన భక్తిప్రపత్తులను చాటుకుంటూ సోమనాథ స్వామి భక్తుడిగా తాను లెక్కలేనన్ని సార్లు శివదర్శనం చేసుకున్నానని గుర్తుకు తెచ్చుకున్నారు. “ఆ ఆదిదేవునికి నేనెన్నో సార్లు శిరసాభివందనం చేశాను. కానీ, నేనివాళ ఇక్కడికి బయలుదేరాక ఈ ప్రయాణం ఆసాంతం అలౌకిక ఆనందానుభూతినిచ్చింది” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

సోమనాథ స్వాభిమాన్ వేడుకల సందర్భంగా కొన్ని నెలల కిందటి తన పర్యటనను గుర్తుతెచ్చుకుంటూ- నేడు ఉత్సవానికి కూడా హాజరు కాగలగడం తనకెంతో ప్రత్యేకమని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. “మొదటి విధ్వంసం ఘట్టానికి 1000 ఏళు పూర్తయిన తర్వాత కూడా సోమనాథ ఆలయం పూర్వవైభవాన్ని కొనసాగించడం మనకెంతో గర్వకారణం. ఇక నేటి ఆధునిక రూపంలో స్వామి ప్రాణ ప్రతిష్ఠాపనకు 75 ఏళ్లు పూర్తయిన తరుణంలో ఈ వెయ్యేళ్ల సుదీర్ఘ అమృత ప్రస్థాన ఆనందానుభూతి మనకు సొంతమైంది” అని శ్రీ మోదీ తన భక్తిభావనను చాటుకున్నారు.

స్వాతంత్ర్యానంతరం 1951 నాటి ప్రతిష్ఠాపన చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ- అదొక సాధారణ ఘట్టమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. “భారత్ 1947లో స్వేచ్ఛా వాయువులు పీల్చగా, 1951లో సోమనాథ ప్రాణప్రతిష్ఠ ఈ దేశ స్వాతంత్ర్య చైతన్యాన్ని చాటుకుంది” అని వివరించారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన నాలుగేళ్లకు ఆలయ పునర్నిర్మాణంలోని విశిష్టతను ప్రస్తావిస్తూ- దేశంలోని 500 సంస్థానాలను రాజకీయంగా ఏకీకృతం చేయాలన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దృఢదీక్షకు, సోమనాథ ఆలయ పునర్నిర్మాణంపై ఆయన సంకల్పానికీ మధ్యగల సారూప్యాన్ని ప్రధానమంత్రి అద్భుతంగా ఉదాహరించారు. ఈ మేరకు “దేశం దాస్య శృంఖలాల నుంచి విముక్తం కావడం, సోమనాథ ఆలయ పునరుద్ధరణ ఏకకాలంలో ప్రపంచానికి ఒక వాస్తవాన్ని చాటిచెప్పాయి. అదేమిటంటే- భారత్ స్వతంత్ర దేశం మాత్రమే కాదు... అది తన ప్రాచీన వైభవాన్ని కూడా తిరిగి సంతరించుకుంటోంది” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ ఘట్టానికిగల బహుముఖ ప్రాశస్త్యాన్ని ప్రస్తావిస్తూ- తానిప్పుడు 75 ఏళ్ల గతంలోకి తొంగి చూడటంతో సరిపుచ్చడం లేదని ప్రధానమంత్రి అన్నారు. “వినాశనంలో సృష్టి సంకల్పాన్ని సోమనాథ ఆలయం రుజువు చేయడం నేనిప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను” అని వ్యాఖ్యానించారు. ఈ పవిత్ర ప్రాంగణంలో అసత్యంపై సత్యం సాధించిన శాశ్వత విజయం తన మనోనేత్రానికి గోచరిస్తున్నదని వర్ణించారు.

విశ్వ సంక్షేమ ప్రబోధం చేసిన వేల ఏళ్ల ఆధ్యాత్మిక చైతన్యానికి తానివాళ ఒక సాక్షిగా నిలుస్తున్నానని ప్రధానమంత్రి అన్నారు. సోమనాత పునరుత్థానంలో భారత అనశ్వర వేదసారంపై మూర్తీభవించిన తన దృక్పథాన్ని ఆయన వివరించారు. “శతాబ్దాల పాటు ప్రయత్నించినా ఈ వైభవ నాశనం ఆ ముష్కర మూకలు దుష్కరమైంది. అటువంటి అపరాజిత భారత నిత్యశాశ్వత స్వరూప సాక్షాత్కారాన్ని నేనిక్కడ చూస్తున్నాను” అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

ఈ వేడుకల రూపంలో భవిష్యత్ దృక్పథాన్ని ప్రకటిస్తూ- సోమనాథ అమృత మహోత్సవం ఒక సంస్మరణ వేడుకకు మించినదని ఆయన పేర్కొన్నారు. “ఇది గతాన్ని స్ఫురణకు తెచ్చుకునే వేడుక కాదు... రాబోయే వెయ్యేళ్లపాటు దేశానికి మార్గనిర్దేశం చేయగల స్ఫూర్తి కూడా” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ మహత్తర సందర్భంలో దేశ ప్రజలకు... ముఖ్యంగా కోట్లాది సోమనాథుని భక్తులకు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు.

దేశ చరిత్రలో 1998 మే 11 నాటి మరో కీలక ఘట్టం- పోఖ్రాన్ అణు పరీక్షల వార్షికోత్సవంతోనూ సోమనాథ అమృత మహోత్సవం ముడిపడి ఉందని ఆయన గుర్తుచేశారు. మన దేశం ఆనాడు 3 అణు పరీక్షల ద్వారా భారత శాస్త్రవేత్తల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని వివరించారు. ముఖ్యంగా 1998 మే 13నాటి ప్రయోగాత్మక పరీక్షలు మన అకుంఠిత రాజకీయ సంకల్పాన్ని శక్తిమంతంగా ప్రదర్శించాయని ప్రముఖంగా ప్రస్తావించారు. “ఆ సమయంలో యావత్ ప్రపంచం భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. కానీ, అటల్ జీ నాయకత్వంలో నాటి ప్రభుత్వం తమకు దేశమే ప్రధానమని స్పష్టం చేస్తూ, ప్రపంచంలో ఏ శక్తికీ భారత్ తలవంచబోదని లేదా ఒత్తిడికి గురికాబోదని నిరూపించింది” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పోఖ్రాన్ అణు పరీక్షకు ‘ఆపరేషన్ శక్తి’గా నామకరణం చేశారంటూ.. లోతైన సాంస్కృతిక ప్రాధాన్యమే అందుకు కారణమని ప్రధానమంత్రి వివరించారు. ఈ మేరకు “శివునితోపాటు శక్తిని పూజించడం మన సంప్రదాయం” అని ఆయన వ్యాఖ్యానించారు. హిందూ ప్రతిమా శాస్త్రాన్ని ఉదాహరిస్తూ- అర్ధనారీశ్వర్వుడు శివశక్తుల అవిభాజ్య తత్త్వాన్ని ప్రదర్శిస్తాడని వివరించారు. ఇక భారత అంతరిక్ష ప్రయోగం చంద్రయాన్ విజయవంతంగా చంద్రునిపై దిగిన ప్రదేశానికి కూడా ఈ తత్త్వం ప్రకారమే ‘శివశక్తి’గా నామకరణం చేశామని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ పద వ్యుత్పత్తి సంబంధాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- ఈ ప్రాచీన జ్ఞాన, ఆధునిక విజ్ఞాన విజయ సంగమంపై ఆయన ఆనందం వెలిబుచ్చారు. “చంద్రుని (సోమ) పేరిట ఇక్కడి జ్యోతిర్లింగానికి ‘సోమనాథుడు’గా పేరు పెట్టడం ఎంతో ఆనందదాయకం” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

శివశక్తులను కలిసి పూజించే సంప్రదాయం నేడు భారత శాస్త్రవిజ్ఞాన ప్రగతికి స్ఫూర్తినిస్తున్న తీరును ప్రధానమంత్రి వివరించారు. “శివశక్తుల ఆరాధన దేశ శాస్త్రవిజ్ఞాన పురోగమనానికీ స్ఫూర్తిగా నిలవాలనే సంకల్పం నెరవేరడాన్ని మనమివాళ చూస్తున్నాం” అని పేర్కొన్నారు. ‘ఆపరేషన్ శక్తి’ వార్షికోత్సవం సందర్భంగా దేశ ప్రజలందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

వెయ్యేళ్ల కిందటి ఆలయ విధ్వంసం-పునరుద్ధరణ గాథను వివరిస్తూ- ఈ చరిత్రకు ప్రాణం పోసిన దేశ ప్రజల అకుంఠిత స్ఫూర్తిని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఘజనీ మహమూద్, అలావుద్దీన్ ఖిల్జీ వంటి దురాక్రమణదారులు వరుస దాడులతో విధ్వంసానికి పాల్పడినా, ఈ ఆలయ పునర్వైభవాన్ని అడ్డుకోలేకపోయారని పేర్కొన్నారు. ఈ మేరకు భోజరాజు, భీమ్‌దేవుడు-ఎ, కుమారపాల, మహీపాల-ఎ, రావు ఖంగర్ వంటి అంకితభావం గల పాలకులు ఈ ఆలయాన్ని ప్రతిసారి పునర్నిర్మిస్తూ భారత ఆధ్యాత్మిక ప్రతిష్ఠను చాటిచెప్పారని తెలిపారు. “ధ్వంసం చేసిన వారికి కనిపించింది కేవలం రాళ్లు, సున్నం మాత్రమే... కానీ, మన నాగరికత మేధ, ఆధ్యాత్మిక శక్తి వారికెన్నడూ అవగతం కాలేదు” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

దేశ సాంస్కృతిక పునరుద్ధరణను ప్రస్తావిస్తూ- ఈ ప్రాంత పవిత్ర వారసత్వాన్ని పరిరక్షించిన లకూలీశ, సోమశర్మ వంటి మహనీయుల కృషిని ప్రధానమంత్రి కొనియాడారు. నాటి ఆధ్యాత్మిక సంప్రదాయాలను నిలబెట్టిన భావ బృహస్పతి, పశుపతాచార్యులు సహా అనేక మంది పండితుల పాండితీ ప్రకర్షను, కృషిని ఆయన ప్రశంసించారు. ఈ ప్రాంత చైతన్యాన్ని పరిరక్షించిన విశాల్‌దేవ్, త్రిపురాంతక వంటి మేధావులను ప్రధాని మోదీ కీర్తించారు. అలాగే, సోమనాధుని సేవకు తమనుతాము అంకితం చేసుకున్న వీర్ హమీర్జీ గోహిల్, వీర్ వేగ్డాజీ భిల్, పుణ్యశ్లోక అహల్యాబాయి హోల్కర్ జీ, బరోడా గైక్వాడ్‌లు, జావ్ సాహెబ్ మహారాజా దిగ్విజయ్ సింగ్ వంటి అనేకమంది మహనీయుల పేర్లను ఆయన ఏకరవు పెట్టారు. సోమనాథ ఆలయ పునరుద్ధరణలో ఆధునిక రూపశిల్పులైన సర్దార్ పటేల్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, కె.ఎం.మున్షీ వంటి సకల మహనీయులకు ఆయన ప్రత్యేకంగా శిరసాభివందనం చేశారు. సమకాలీన బాధ్యత దిశగా వారి వారసత్వం నుంచి తాను స్ఫూర్తి పొందుతున్నాని చెప్పారు. “వారి స్మరణ మనకు ఎనలేని స్ఫూర్తినిస్తుంది.. తద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడమే గాక ఈ బాధ్యతను భావితరాలకు అప్పగించాలి” అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

విస్తృత భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని స్మరించుకుంటూ- వేల ఏళ్లుగా మన సాంస్కృతిక ప్రదేశాలు దేశానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చిపెట్టాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అయినప్పటికీ, స్వాతంత్ర్యానంతరం ఒక బాధాకర వైరుధ్యం పొడసూపిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పోలికలను ప్రస్తావిస్తూ- దండయాత్రల వల్ల వారసత్వ సంపద నాశనమైనపుడు ప్రపంచంలోని ఇతర దేశాలు అనంతర కాలంలో దాని పునరుద్ధరణ దిశగా ఐక్యమయ్యాయని గుర్తుచేశారు. ఈ లక్ష్యం దిశగా స్వతంత్ర భారత తొలినాళ్ల నాయకుల అపార కృషిని ప్రధానమంత్రి ప్రశంసిస్తూనే- వారిలో కొందరికి వ్యతిరేకత ఎదురుకావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. “అయినప్పటికీ, సర్దార్ సాహిబ్ దృఢ సంకల్పంతో శతాబ్దాల నాటి అవమానాన్ని దేశం తుడిచిపెట్టగలిగింది” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

సమకాలీన సమస్యలపై ఆందోళన ప్రకటిస్తూ- విచ్ఛిన్న శక్తులు నేటికీ చురుగ్గా ఉన్నాయని ప్రధానమంత్రి అప్రమత్తం చేశారు. జాతీయ ప్రాధాన్యంగల సాంస్కృతిక కార్యాచరణపై వ్యతిరేకతకు సంబంధించి ఇటీవలి పరిణామాలను ఆయన ఉదాహరించారు. ఇలాంటి విచ్ఛిన్నవాద ధోరణులపై జాగరూకత వహించాలని పిలుపునిచ్చారు. జాతీయ పురోగమనంలోని రెండు కోణాలనూ గౌరవించే సమతుల దార్శనికతను ఆయన వివరించారు. ఆ మేరకు “అభివృద్ధి, వారసత్వం రెండింటి సమ్మేళనంతో మనం ముందంజ వేయాలి” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆర్థిక రూపాంతరీకరణలో ఆలయ ధర్మకర్తల మండలి పాత్రను ప్రస్తావిస్తూ- సోమనాథ ఆలయం ఏకకాలంలో ఒక ఆధ్యాత్మిక కూడలిగా.. వందలాది కుటుంబాలకు అనేకానేక రూపాల్లో జీవనోపాధి కల్పించేదిగా, ఆర్థిక చోదక శక్తిగా, సమీకృత ప్రగతికి మార్గదర్శిగా నిలిచిన తీరును ప్రధానమంత్రి శ్లాఘించారు. “ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు... వారి పర్యటన ఈ ప్రాంత సౌభాగ్యానికి బాటలు వేస్తుంది” అని ఆయన వ్యాఖ్యానించారు.

భారత పుణ్యక్షేత్రాల నెట్‌వర్క్‌పై తన దృక్కోణాన్ని వివరిస్తూ- ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా చేపట్టిన పరిణామాత్మక అభివృద్ధిని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ మేరకు కేదార్‌నాథ్ పునర్నిర్మాణం, కాశీ విశ్వనాథ్ క్షేత్రం సుందరీకరణ, ఉజ్జయినిలోని మహాకాల్ మహాలోక్, చార్‌ధామ్ హైవే ప్రాజెక్ట్, గోవింద్‌ఘాట్ నుంచి హేమకుండ్ సాహిబ్ దాకా రోప్‌వే ప్రాజెక్ట్, కర్తార్‌పూర్ కారిడార్, బౌద్ధ సర్క్యూట్ వంటి వాటిని ఈ సందర్భంగా ఉదాహరించారు. “ఈ పురోగమనం మొత్తం కేవలం 10-12 ఏళ్ల వ్యవధిలో సాకారమైంది. సాంస్కృతిక ప్రదేశాలు ప్రగతికి అవరోధాలు కావని, వాస్తవానికి దేశ ఆధ్యాత్మిక-సామాజిక వ్యవస్థకు అవి కూడళ్లు మాత్రమేగాక ఆర్థిక ప్రగతికి మూలాలని, నిజమైన అభివృద్ధికి ముఖ ద్వారాలని ఈ పరిణామం రుజువు చేస్తోంది” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఈ కృషికి తాత్త్విక పునాదిని ప్రస్తావిస్తూ- ఉపనిషత్తులలోని ‘సర్వం ఖల్విదం బ్రహ్మ’ (అంతా బ్రహ్మమే) అనే మాటలను ప్రధానమంత్రి ఉటంకించారు. నదులు, అడవులు, పర్వతాలు... యావత్ ప్రకృతినీ ఇది పవిత్ర స్వరూపంగా ఇది పరిగణిస్తుందని ఆయన వివరించారు. “ప్రపంచం ప్రకృతితో సామరస్యం నెరపేందుకు సిద్ధమైన నేపథ్యంలో మనమీ ప్రాచీన జ్ఞానాన్ని గుర్తించి, పంచుకోవాలి. సామరస్యపూర్వక అభివృద్ధికి ఆదర్శంగా మన పవిత్ర క్షేత్రాలను యావత్ ప్రపంచం ముందు నిలుపుదాం” అని శ్రీ మోదీ పిలుపునిచ్చారు.

జాతీయ సామర్థ్యం ఇనుమడించడంలో సాంస్కృతిక వారసత్వం కొనసాగింపు పాత్రను విశదీకరిస్తూ- చరిత్ర, విశ్వాసం, విలువలతో నవతరం పునస్సంధానమైతే దేశ అంతర్గత శక్తి అపారం కాగలదని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. “నేటి భారత్ ఆత్మవిశ్వాసానికి ఎంతగానో దోహదం చేసింది ఈ సాంస్కృతిక కొనసాగింపే”నని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఈ మేరకు భావితరాలకు పిలుపునిస్తూ- 75 ఏళ్ల కిందటి సోమనాథ ప్రతిష్ఠాపన ఒక పరిణామాత్మక ప్రస్థానానికి నాంది పలికిందని ప్రధానమంత్రి ప్రజలకు గుర్తుచేశారు.

# శ్రీశైలం పుణ్య క్షేత్రంలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు..



అమరావతి, మే 12:జ్యోతిర్లింగాలలో ఒకటైనా నంద్యాల జిల్లాలో శ్రీశైలం లోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని శ్రీ భక్తాంజనేయస్వామివారికి విశేషపూజలు నిర్వహించబడ్డాయని కార్యనిర్వాహణాధికారి తెలిపారు. శ్రీశైలంలోని పాతాళగంగమార్గంలో శ్రీ భక్తాంజనేయస్వామివారి ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు జరిపించబడ్డాయన్నారు.

లోక కల్యాణం కోసం జరిపిన ఈ విశేషపూజలలో భాగంగా ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలలో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి, వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్ని, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని అర్చకులు సంకల్పాన్ని చెప్పారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ జరిపించబడిందన్నారు.

అనంతరం భక్తాంజనేయస్వామి వారికి ఆయా సూక్తాలతో పంచామృతాభిషేకం, జలాభిషేకం జరిపించబడ్డాయన్నారు. తరువాత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తరపూజ, నాగవల్లిదళపూజ ఆకుపూజ, వడమాల సమర్పణ, పుష్పార్చన జరిపించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, దేవస్థానం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# మన నాగరిక ధైర్యాన్ని, అచంచలమైన భక్తిని సోమనాథ్ ఆలయం ప్రతిబింబిస్తోందన్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, మే 12:సోమనాథ్ అమృత్ మహోత్సవానికి సంబంధించిన పలు విశేషాలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ప్రజలతో పంచుకున్నారు.

పవిత్రమైన సోమనాథ్ ఆలయపు ఎత్తయిన శిఖరంపై సగర్వంగా ఎగురుతున్న ధర్మధ్వజాన్ని చూస్తుంటే.. దేశ అచంచల విజయానికి సంకేతంగానూ, కోట్లాది మంది భారతీయుల సామూహిక చైతన్యానికి దివ్య ప్రకటనగానూ కనిపిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సోమనాథ్ శిఖరాగ్రాన ఉన్న ఆ కాషాయ పతాకం అచంచల భక్తికి సజీవ విజయగాథ అని, అది శాశ్వతంగా భారత కీర్తిని గానం చేస్తూ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

ఆలయ చరిత్రను గుర్తుచేస్తూ, వెయ్యేళ్ల కిందట సోమనాథ్ ఆలయంపై తొలి దాడి జరిగిందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ నేల సంస్కృతిని నాశనం చేయగలమని భావించిన దురాక్రమణదారులు సోమనాథ్‌పై అనేక దాడులకు పాల్పడ్డారని ప్రస్తావించారు. భరతమాత అత్యంత ధైర్యవంతులైన బిడ్డల కృషి వల్లే సోమనాథ్ ఆలయం పదేపదే పునర్నిర్మాణం అవుతూనే వచ్చిందని ఆయన కొనియాడారు. సరిగ్గా 75 ఏళ్ల క్రితం ఇదే రోజున అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో... పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయని ప్రధాని శ్రీ మోదీ గుర్తు చేశారు. ఆక్రమణదారులు చరిత్ర గర్భంలో కలిసిపోయారని, కానీ భారత్ ఆత్మ మాత్రం అజరామరమని ఆ రోజే ప్రపంచానికి చాటిచెప్పినట్లు తెలిపారు. నాగరికత ధైర్యానికి, విడదీయలేని భక్తికి నిదర్శనంగా సోమనాథ్ నేడు సగర్వంగా నిలిచి ఉందని పేర్కొంటూ.. మహాదేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు.

“పవిత్రమైన సోమనాథ ఆలయపు ఎత్తయిన శిఖరంపై సగర్వంగా రెపరెపలాడుతున్న పవిత్ర ధర్మధ్వజం దేశ అచంచల విజయానికి ప్రతీక. ఇది కోట్లాది మంది భారతీయుల సమష్టి చైతన్యంగా, దైవిక ప్రకటనగా కూడా కనిపిస్తోంది. సోమనాథ్ శిఖరాగ్రాన ఉన్న ఈ కాషాయ పతాకం మన విడదీయలేని భక్తికి సజీవ విజయగాథ. ఇది ప్రతి భారతీయుడికి నిరంతరం స్ఫూర్తినిస్తూ.. దేశ కీర్తిని శాశ్వతంగా ఆలపిస్తూనే ఉంటుంది”

“వెయ్యేళ్ల క్రితం సోమనాథ్ ఆలయంపై తొలి దాడి జరిగింది. మన నేల స్వరూపాన్ని నాశనం చేయగలమని భావించిన వారు అప్పట్లో పదేపదే దాడులకు తెగబడ్డారు. కానీ వారి నమ్మకం తప్పయింది. భరతమాత అత్యంత పరాక్రమవంతులైన బిడ్డల పుణ్యమా అని సోమనాథ్ పదేపదే పునర్నిర్మాణం అవుతూనే వచ్చింది.

సరిగ్గా 75 ఏళ్ల క్రితం ఇదే రోజున అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో సోమనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. దాడులు చేసిన వారు చరిత్ర గర్భంలో కలిసిపోయారు. కానీ భారత్ ఆత్మ మాత్రం శాశ్వతంగా నిలిచి ఉంది.

నేడు సోమనాథ్ మన నాగరికత ధైర్యానికి, మన అచంచలమైన భక్తికి నిదర్శనంగా సమున్నతంగా, శాశ్వతంగా నిలిచి ఉంది. ఆ మహాదేవుని ఆశీస్సులు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను”

# ఒక పదార్థంలోని అతి సూక్ష్మకణాల్లో అపారమైన శక్తిని మేల్కొలిపే ప్రజ్వలమైన సారం అగ్ని అని స్పష్టం చేసే సంస్కృత సుభాషితాన్ని పంచుకున్న పీఎం

న్యూ ఢిల్లీ, మే 12:1998లో పోఖ్రాన్ పరీక్షలు విజయవంతమయ్యేందుకు శాస్త్రవేత్తలు చేసిన కృషిని, వారి అంకితభావాన్ని ప్రధానమంత్రి ఎంతో గర్వంగా గుర్తు చేసుకున్నారు. భారతదేశ శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని, అంచలమైన దేశ నిబద్ధతను ఆ చరిత్రాత్మక ఘట్టం ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

స్వావలంబన భారత్ నిర్మాణంలో సాంకేతికత కీలకంగా మారిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణలను వేగవంతం చేస్తోందని, అవకాశాలను విస్తరిస్తుందని అన్ని రంగాల్లో దేశాభివృద్ధికి తోడ్పడుతోందని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రతిభకు సాధికారత కల్పించటం, పరిశోధనలను ప్రోత్సహించటం, దేశ ప్రగతితో పాటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పరిష్కారాలను రూపొందించటంపైనే నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ... 1998లో ఇదే రోజున పోఖ్రాన్‌లో నిర్వహించిన అణు పరీక్షలు భారతదేశ అద్భుత సామర్థ్యాలను ప్రపంచానికి పరిచయం చేశాయని ప్రధానమంత్రి తెలిపారు. దేశం గర్వించేలా చేసి, ఆత్మగౌరవాన్ని పెంపొందించిన శాస్త్రవేత్తలను నిజమైన దేశ రూపశిల్పులని కొనియాడారు. దివ్యలోకాలకు ఉన్నతమైన శక్తి అగ్ని అని, భూమిపై సమస్త శక్తికి అదే మూలధారమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తేజోరూపమైన అగ్ని.. పదార్థంలోని అత్యంత సూక్ష్మమైన పరమాణువుల్లో దాగున్న అపారమైన శక్తిని మేల్కొల్పి, సృష్టి అంతటా శక్తిని, చైతన్యాన్ని విస్తరించేలా చేస్తుందంటూ సంస్కృత సుభాషితాన్ని ప్రధానమంత్రి పంచుకున్నారు.

# రోగుల ప్రాణాలను కాపాడే యోధులు..నర్సులు

**–సేవలో మానవత్వం.. నర్సింగ్ వృత్తి గొప్పతనం**
**–సంతృప్తికర వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం**
**–వనరుల సద్వినియోగంతో ప్రైవేటుగా దీటుగా జీజీహెచ్ సేవలు**
**–త్వరలో అన్ని సమస్యలకూ పరిష్కారం**
**–ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



విజయవాడ, మే 12: రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని.. వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ రోగులకు ధైర్యం, భరోసా కల్పిస్తూ చక్కని చిరునవ్వుతో ఆత్మీయతతో రోగాన్ని దూరం చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజల ఆరోగ్యరక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ జి.అక్కమ్మ రూ. 50 వేలు అందించగా.. మరో లక్షా యాభైవేలు నర్సింగ్ అసోసియేషన్ ద్వారా సమకూర్చి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూనే జీజీహెచ్ ద్వారా అందించే వైద్య సేవల్లో 80 శాతానికి పైగా సంతృప్తి స్థాయి నమోదుకావడంలో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల, వసతి గృహానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని.. త్వరలోనే ఇవి పరిష్కారమవుతాయన్నారు.

ఆసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి రోగుల మన్ననలు పొందుతోందని.. ప్రభుత్వ చొరవతో పాటు సీఎస్ఆర్, దాతల సహకారంతోనూ ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు చిరస్మరణీయమని, ఆమె చూపిన సేవా మార్గం నేటికీ నర్సింగ్ వృత్తికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని మరింత మానవీయ దృక్పథంతో, ఆప్యాయతతో రోగులకు సేవలందించినప్పుడే ఆమెకు నిజమైన నివాళులు అర్పించినవారమవుతామని తెలిపారు.

రాత్రీపగలు రోగుల్ని కంటికి రెప్పలా చూసుకుంటూ రోగాన్ని నయం చేసి ఇళ్లకు క్షేమంగా పంపిస్తూ నర్సులు ఆదరాభిమానాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనలో వైద్య సేవల్లో నాణ్యత అత్యంత ముఖ్యమని.. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, ఆరోగ్య ఆంధ్ర సాధనకు విశేష కృషిచేస్తోందని పేర్కొన్నారు. ఏ ఆసుపత్రిలో లేనివిధంగా ఇక్కడ ఓపీ ఉంటోందని.. ఇక్కడ అందుతున్న నాణ్యమైన సేవలకు ఇది నిదర్శనమన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌లో 95 శాతానికి పైగా సంతృప్తి స్థాయి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

అన్ని విభాగాలూ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేసినప్పుడే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా అత్యవసర పరిస్థితులు, క్లిష్ట సమయాల్లో నర్సులు చూపించే అంకితభావం, సహనం, సేవా దృక్పథం సమాజానికి ఆదర్శమని తెలిపారు. రోగులు త్వరగా కోలుకోవడంలో నర్సుల సంరక్షణ, మానసిక ధైర్యం ఎంతో ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమని.. రోగుల ఆరోగ్య పరిరక్షణలో వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ సేవలందిస్తున్నారని కొనియాడారు.

సేవాభావం, సహనం, మానవత్వంతో నిండిన నర్సింగ్ వృత్తి సమాజానికి ఆదర్శప్రాయమని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరవదని తెలిపారు. నర్సింగ్ సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు విద్యాసాగర్ వెల్లడించారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 35 మందిని గౌరవ అతిథులు సత్కరించారు. విధి నిర్వహణలో వీరు అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎ.ఏడుకొండలరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారావు, జిల్లా నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు క్షమాబేగం, కోశాధికారి కె.శివలీల, ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షకార్యదర్శులు డీఎస్ఎన్ రెడ్డి, పి.రమేష్, నగరశాఖ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా సంక్షోభంపై రక్షణ మంత్రి అధ్యక్షతన 5వ ఐజీఓఎం సమావేశం

న్యూఢిల్లీ, మే 12:2026 మే 11న ఢిల్లీలోని కర్తవ్య భవన్–2లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన పశ్చిమాసిమా సంక్షోభంపై 5వ ఐజీఓఎం (ఇన్ఫార్మల్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్) సమావేశం జరిగింది. ఇందులో ఘర్షణకు సంబంధించిన తాజా పరిణామాలను సమీక్షించారు. దాని ప్రభావం ప్రజలపై కనిష్ఠంగా ఉండేలా చూడటానికి భారతదేశ సంసిద్ధతను బలోపేతం చేసే మార్గాలపై ఇందులో చర్చించారు. రసాయనాలు– ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా.. పెట్రోలియం– సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి.. రైల్వే, సమాచార– ప్రసార, ఎలక్ట్రానిక్స్ - ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్.. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజు.. పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు.. ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్.. శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

దేశం సురక్షితంగా ఉందని, ఇతర దేశాలు దేశీయ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు అత్యవసర చర్యలు తీసుకుంటున్నప్పటికీ భారత్‌లో పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో ఎటువంటి కొరత లేదని ఐజీఓఎంకు సమాచారం అందించారు. భారత్‌లో 60 రోజుల ముడి చమురు, 60 రోజుల సహజ వాయువు, 45 రోజుల ఎల్‌పీజీ నిల్వలు (రోలింగ్ స్టాక్) ఉన్నాయి. 703 బిలియన్ డాలర్ల నిల్వలతో విదేశీ మారకద్రవ్యం విషయంలో సౌకర్యవంతమైన స్థాయిలో దేశం ఉంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు శుద్ధి దేశంగా, పెట్రోలియం ఉత్పత్తుల నాలుగో అతిపెద్ద ఎగుమతిదారుగా ఉన్న భారత్.. 150 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి చేస్తూనే దేశీయ డిమాండ్‌ను పూర్తిగా తీరుస్తోంది. అయితే అంతర్జాతీయ ముడిచమురు ధరలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల దేశం భారీ మూల్యాన్ని చెల్లిస్తోంది. ఇంధన పొదుపు ఈ భారాన్ని తగ్గించగలదు. అంతర్జాతీయ ఘర్షణల వల్ల ఏర్పడిన ప్రపంచ ఆర్థిక అంతరాయాలు, సరఫరా వ్యవస్థ సవాళ్లు, పెరుగుతున్న ధరలను ఎదుర్కోవడంలో దేశానికి సహాయపడటానికి సామూహిక భాగస్వామ్యం కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలకు చేసిన విజ్ఞప్తి.. పెట్రోలియం ఉత్పత్తుల వినియోగంలో విచక్షణ, వృథా వినియోగించటాన్ని తగ్గించడాన్ని ప్రధానంగా తెలియజేసింది. తద్వారా దేశంపై ప్రస్తుతం, భవిష్యత్తులో ఉండే ఆర్థిక భారం తగ్గుతుంది.

ప్రపంచవ్యాప్త అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ఘర్షణ ప్రారంభమై 70 రోజులు దాటినా పెట్రోలియం ధరలు స్థిరంగా ఉన్న అతికొద్ది దేశాలలో భారత్ ఒకటి. అనేక దేశాల్లో ధరలు 30 నుంచి 70 శాతం వరకు పెరిగాయి. అయితే అంతర్జాతీయంగా ఆకాశాన్నంటుతున్న ధరల భారం భారతీయులపై పడకుండా ఉంచేందుకు భారత చమురు విక్రయ సంస్థలు రోజుకు దాదాపు రూ. 1,000 కోట్ల నష్టాలను భరిస్తున్నాయి. 2026 మొదటి త్రైమాసికంలో ఈ నష్టాలు (అండర్–రికవరీలు) దాదాపు రూ. 2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. ఎవరూ పెట్రోల్ బంకులకు పరుగులు తీయాల్సిన అవసరం లేదు.

ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు సమృద్ధిగా ఉన్నాయని, ఒకవేళ ఈ సంక్షోభం గనుక సుదీర్ఘకాలం కొనసాగితే భవిష్యత్తు అవసరాల కోసం దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడమే ప్రస్తుత పొదుపు చర్యల ఉద్దేశమని మంత్రులు తెలియజేశారు. సరఫరా నిర్వహణ బాగుందని, ప్రజలు భయాందోళనకు గురవ్వాల్సిన అవసరం లేదని, ఇంధనం– ఇతర ఉత్పత్తులను అధికంగా కొనుగోలు చేయాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

ప్రధాన మంత్రి విజ్ఞప్తిని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రక్షణ మంత్రి అధికారులను ఆదేశించారు. మెట్రో– ప్రజా రవాణాను ఉపయోగించడం, కార్ పూలింగ్ ద్వారా పెట్రోల్–డీజిల్ వినియోగాన్ని తగ్గించటం, అనవసరమైన విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండటం, దేశీయ పర్యాటకం– భారతదేశంలోనే వేడుకలను చేసుకోవటం ద్వారా విదేశీ మారకద్రవ్య నిల్వలను కాపాడటం, ఒక సంవత్సరం పాటు అనవసరమైన బంగారు కొనుగోళ్లను నివారించటం చేయాలని 2026 మే 11న ప్రధాన మంత్రి ప్రజలకు సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని 50 శాతం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని.. వ్యవసాయంలో డీజిల్ పంపులకు బదులుగా సౌరశక్తితో నడిచే నీటి పంపులను విస్తృతంగా వినియోగించాలని ఆయన రైతులను కోరారు. “ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి, బాధ్యతాయుతమైన వినియోగ ప్రవర్తనను వ్యవస్థీకృతం చేయడానికి అవసరమైన చర్యలను మంత్రిత్వ శాఖలు– రాష్ట్రాలు సమన్వయ పద్ధతిలో గుర్తించాలి” అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

సమావేశం అనంతరం సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో చేసిన ఒక పోస్ట్‌లో అన్ని నిత్యావసర వస్తువుల సరఫరాను నిర్ధారించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. కొరత లేదా సరఫరా గొలుసులో అంతరాయాలను నివారించడానికి అన్ని పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపిన ఆయన.. ప్రజలు ఆందోళన చెందొద్దని, ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని కోరారు.

ప్రస్తుత తరుణంలో ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగేలా చూడటం, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటం, సముద్ర వాణిజ్య మార్గాల భద్రతను నిర్ధారించడంపైనే భారత్ ప్రధానంగా దృష్టి సారించాలని రక్షణ మంత్రి ప్రముఖంగా చెప్పారు. అన్ని రకాల పరిస్థితులను ఎదుర్కోవడానికి అన్ని భాగస్వామ్య పక్షాలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

భారత్ ఇంధన వనరులను వైవిధ్యం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలన్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి.. పునరుత్పాదక ఆధారిత ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వేగంగా విస్తరించటం, మరింత నమ్మకమైన– వైవిధ్యభరితమైన ఇంధన సరఫరాలను గుర్తించటం, ఇంధన సామర్థ్య సాంకేతికతలలో పెట్టుబడులను పెంచాల్సిన అత్యవసర అవసరాన్ని ప్రధానంగా పేర్కొన్నారు. భవిష్యత్ ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకొని సరఫరా వ్యవస్థ అంతరాయాల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక నిల్వల విషయంలో పునఃసమీక్ష చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రవేశాలు ప్రారంభం..

**–33 హాస్టళ్లకు ఔత్సాహిక విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం**
**–జిల్లా ఎస్‌సీ సంక్షేమం, సాధికారిత అధికారి కేవిల్ హర్షిత**

విజయవాడ, మే 12: జిల్లాలోని 33 సాంఘిక సంక్షేమ బాలురు, బాలికల వసతి గృహాల్లో 2026–27 విద్యా సంవత్సరానికిగాను మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్‌సీ సంక్షేమం, సాధికారిత అధికారి కేవిల్ హర్షిత మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అదేవిధంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా, ఫార్మసీ , మెడికల్, పీజీ, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో చదువుకొనే విద్యార్థులు పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో ప్రవేశాలకు గాను ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, ఓబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రి మెట్రిక్‌కు సంబంధించి బాలురుకు 10, బాలికలకు 11 వసతి గృహాలు ఉన్నాయని, పోస్టు మెట్రిక్‌కు సంబంధించి బాలురుకు 6, బాలికలకు 6 వసతి గృహాలు ఉన్నట్లు తెలిపారు. విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో 9, నందిగామ పరిధిలో 13, తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 11 హాస్టళ్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి హాస్టల్ నందు 100 మందికి ప్రవేశం ఉంటుందని.. ఎస్‌సీలకు 70 శాతం, మిగిలిన వారికి 30 శాతం కేటాయించడం జరుగుతుందన్నారు.

సాంఘిక సంక్షేమ గృహాలను ప్రభుత్వం ఆధునికీకరించిందని, ఆర్వో ప్లాంట్ల ద్వారా శుభ్రమైన తాగునీరు, మెనూ ప్రకారం పౌష్టికాహారం వంటివాటితో పాటు సీసీ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కాస్మెటిక్స్ ఛార్జీలు, వివిధ రకాల వస్తువులు, క్రీడా సామగ్రి వంటివాటిని ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ట్యూటర్లు కూడా అందుబాటులో ఉంటామన్నారు. విద్యార్థులు తమ గ్రామంలోని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా లేదా నేరుగా దగ్గర్లోని హాస్టల్ వార్డెన్ / సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పూర్తి సమాచారానికి విజయవాడ, తిరువూరు, నందిగామ డివిజన్ల సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారుల కార్యాలయాలు, మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ కార్యాలయం, విజయవాడ పటమటలోని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సందర్శించవచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల లోపు 87907 52259, 94925 83600 నంబర్లకు ఫోన్ చేసి కూడా సమాచారం పొందవచ్చని ఎస్‌సీ సంక్షేమం, సాధికారిత అధికారి కేవిల్ హర్షిత తెలిపారు.

# ఈ-నామ్ మార్కెట్లలో రైతులకు లాభాల వర్షం

కర్నూలు, మే 12:కర్నూలు, ఆదోని ఈ–నామ్ వ్యవసాయ మార్కెట్లలో మంగళవారం నమోదైన ధరలు రైతుల్లో ఆశావహ వాతావరణాన్ని నెలకొల్పాయి. మసాలా పంటలు, నూనె గింజలు, పత్తి, పప్పుధాన్యాలకు మంచి గిరాకీ కనిపించడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కర్నూలు మార్కెట్‌లో వాము రికార్డు స్థాయిలో ధర పలకగా, ఆదోని మార్కెట్‌లో పత్తి క్వింటాకు రూ. 10 వేల మార్క్ దాటడం చర్చనీయాంశమైంది.

కర్నూలు మార్కెట్‌లో వాము హవా..

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ–నామ్ వేదికపై జరిగిన వ్యాపారంలో వాము (అజ్వైన్) పంటకు భారీ డిమాండ్ కనిపించింది. మొత్తం 93 లాట్లలో 604 సంచులు, 302 క్వింటాళ్ల వాము మార్కెట్‌కు రాగా, కనిష్ట ధర రూ. 5,114, మోడల్ ధర రూ. 15,588, గరిష్ట ధర రూ. 18,899 నమోదైంది. దేశీయ మార్కెట్‌తో పాటు ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా పోటీగా కొనుగోళ్లు జరపడంతో ఈ స్థాయి ధరలు నమోదైనట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

మిర్చికి కొనసాగుతున్న మంచి ధర..

ఎండు మిర్చి రైతులకు కూడా మంగళవారం మార్కెట్ ఊరటనిచ్చింది. 21 లాట్లలో 107 సంచుల మిర్చి మార్కెట్‌కు రాగా, కనిష్ట ధర రూ. 6,666, మోడల్ ధర రూ. 16,709, గరిష్ట ధర రూ. 19,399 నమోదైంది. నాణ్యమైన మిర్చికి వ్యాపారులు పోటీగా ధరలు కోట్ చేయడం గమనార్హం.

పప్పుధాన్యాలకు నిలకడైన మార్కెట్..

కందుల గింజలకు క్వింటాకు రూ. 7,792 వరకు ధర లభించగా, మోడల్ ధర రూ. 7,720గా నమోదైంది. మొత్తం 37 లాట్లలో 439 సంచులు, 220 క్వింటాళ్ల కందులు మార్కెట్‌కు వచ్చాయి. మినుములకు కూడా మంచి గిరాకీ కొనసాగింది. నాలుగు లాట్లలో వచ్చిన మినుములకు గరిష్టంగా రూ. 7,862 ధర నమోదైంది. వేరుశెనగలకు రూ. 7,469, ఆముదాలకు రూ. 6,090, పొద్దుతిరుగుడు గింజలకు రూ. 6,119 వరకు ధర లభించగా, శనగలకు రూ. 5,310 ధర వచ్చింది. మొక్కజొన్న ధరలు మాత్రం పరిమిత స్థాయిలో కొనసాగాయి.


ఆదోనిలో పత్తికి భారీ ధర..

ఇక ఆదోని ఈ–నామ్ మార్కెట్‌లో పత్తి రైతులకు మంచి ఊరట లభించింది. 110 సంచుల్లో 436 క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు రాగా, కనిష్ట ధర రూ. 4,389, మోడల్ ధర రూ. 9,799, గరిష్ట ధర రూ. 10,349 నమోదైంది. నాణ్యమైన పత్తికి వ్యాపారులు పోటీగా ధరలు పెట్టడంతో పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేరుశెనగలకు కూడా ఆదోని మార్కెట్‌లో మంచి డిమాండ్ కొనసాగింది. 268 క్వింటాళ్ల వేరుశెనగలకు గరిష్టంగా రూ. 7,936 ధర నమోదైంది. ఆముదం పంటకు రూ. 6,132 వరకు ధర రావడం రైతులకు ఊరటనిచ్చింది. పూల విత్తనాలకు క్వింటాకు రూ. 5,731 ధర నమోదైంది.3

డిజిటల్ వేలం విధానం కారణంగా వివిధ ప్రాంతాల వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా వేలంలో పాల్గొనడం వల్ల పోటీ పెరిగిందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. మధ్యవర్తుల ప్రభావం తగ్గడంతో రైతులకు నేరుగా మెరుగైన ధరలు అందుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం రైతులు తేమ శాతం తగ్గించి, శుభ్రపరిచిన నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువస్తే మరింత అధిక ధరలు పొందే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నిల్వ సామర్థ్యం ఉన్న రైతులు మార్కెట్ ధోరణులను గమనిస్తూ సరైన సమయంలో విక్రయాలు చేపడితే లాభాలు మరింత పెరుగుతాయని అభిప్రాయపడుతున్నారు.

# నంద్యాలలో రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య..

**–సూసైడ్ నోట్ లో కలిసి వేసే పదాలు**
**–నా శవాన్ని కుక్కలకు వేయండి..**
**–ఆ యువకుడు సూసైడ్ నోట్ లో రాసిన పదాలు**



నంద్యాల, మే 12: నంద్యాల సమీప ప్రాంతాల్లో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుందని రైల్వే ఎస్సై కుమారి తెలిపారు. ఈ సంఘటన లో చిరంజీవి 25 అనే యువకుడు ఆత్మహత్య చేసుకోవటం జరిగిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న చిరంజీవి తల్లిదండ్రులకు భారం అయ్యాన ని భావించి ఈ ఆత్మహత్య తీసుకుంటున్నానని నా శవాన్ని కుక్కలకు వెయ్యండి తల్లిదండ్రులకు ఇవ్వవద్దు అంటూ సూసైడ్ నోట్లో రాసిన వాక్యాలు ఇప్పుడు సంచలనం కలిగిస్తున్నాయి. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు నం ద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం పడకండ్లకు చెందిన మునేయ్యకు నలుగురు సంతానం పుట్టి చనిపోయారు. ఐదవ సంతానమ్మ చిరంజీవి జన్మించాడు. చిరంజీవి పుట్టుకతోనే మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఉన్నాడని తెలిపారు. వైద్యం కోసం తండ్రి లక్షల రూపాయలు ఖర్చు చేశాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు భారమయ్యానని భావించి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవ టం విశేషం. పోలీసులు కేసు న మోదు చేసుకుని జరిగిన సంఘటనపై దర్యాప్తు చేస్తున్న ట్లు తెలిపారు.

# శ్రీ తటాక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



అమరావతి, మే 12: గ్రేటర్ పరిధిలోని 55వ డివిజన్ భీమారం తటాక ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్వామివారికి హనుమాన్ స్వాములు గురుస్వామి కొండం రాజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా ఆలయంలో ఉత్సవ మూర్తిని ప్రతిష్టించి పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనాథచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించి ఇరుముడి కట్టుకున్నారు. ఈ సందర్భంగా స్వాముల శ్రీ రామ నామ స్మరణతో ఆలయం ప్రతిధ్వనించింది. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది స్వాములు,భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారుపేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహం భద్రపరిచిన పోలీసులు.**

కర్నూలు, మే 12: కర్నూలు నగరంలోని బంగారుపేట సర్కిల్ పరిధిలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం మృతుడు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండి, తెలుపు రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడు.అయితే మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు టూ టౌన్ సీఐ శ్రీధర్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను లేదా టూ టౌన్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

# డిఆర్ డి ఏపిడిని సన్మానించిన వివో ఏలు..

ఆదిలాబాద్, మే 12:నారాయణపేట జిల్లా డి ఆర్ డి ఏ పీడీగా ఎన్ వెంకట్రాములు ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించడంతో ఊట్కూర్ మండల వివో ఏలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వివో ఏ ల సంఘం అధ్యక్షులు అనిల్, కార్యదర్శి స్వాతి మాట్లాడుతూ.. వివోఎల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 18 నుండి సమ్మె చేపడుతున్నామని అన్నారు. వివో ఏ లకు నెలకురూ.20 వేలు వేతనం చెల్లించాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్‌ఏ కల్పించాలని అర్హత కలిగిన తమను సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 58 సవరణ చేసి ట్యాబుసౌకర్యంకల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివో ఏ లు వెంకటేశ్వరమ్మ, సుజాత, కల్పన, రామేశ్వరి, సంతోష, అనిత, జ్యోతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త గ్రామీణ ఉపాధి చట్టంతో కార్మికులు, రైతులు, గ్రామాలు మూడింటికీ సాధికారత: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, మే 12:భారత గ్రామీణ అభివృద్ధి చరిత్రలో ఒక కీలక మైలురాయి నమోదైంది. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'వికసిత్ భారత్-ఉపాధి, జీవనోపాధి హామీ మిషన్ (గ్రామీణ) చట్టం' అమలుకు సంబంధించి మే 11, 2026 (నేడు) అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని క్లుప్తంగా వీబీ-జీ రామ్ జీ చట్టం అని కూడా పిలుస్తారు. ఈ చట్టం జులై 1, 2026 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రానుంది. ఈ నూతన చట్టం గ్రామీణ పేదలు, కార్మిక కుటుంబాలు, మహిళలు, స్వయం సహాయక సంఘాలు, రైతుల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తుందని కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. మెరుగైన ఆదాయ భద్రతకు, భారీ స్థాయి సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలకు ఈ చట్టం మార్గం సుగమం చేస్తుందని తెలిపారు.

నేడు భోపాల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్ జీ-రామ్ జీ' చట్టానికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనట్లు కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. జులై 1వ తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వస్తుందని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోరుకునే కార్మికులకు ఏడాదికి కల్పించే పని దినాలను గతంలో ఉన్న 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచుతున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త చట్టం అమలులోకి వచ్చే వరకు (జులై 1 లోపు) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిబంధనలే అమలులో ఉంటాయని అన్నారు. ఆ లోపు పెండింగ్‌లో ఉన్న పనులన్నీ ఉపాధి హామీ పథకం కిందనే పూర్తి అవుతాయని చెప్పారు. రాష్ట్రాలతో విస్తృత స్థాయి సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ కొత్త చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని తెలిపారు. మార్పు ప్రక్రియలో ఏ ఒక్క కార్మికుడు కూడా ఉపాధికి దూరం కాకుండా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఉపాధికి ఎటువంటి ఆటంకం కలగకుండా ఇప్పటికే పూర్తి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

'వికసిత్ భారత్ జీ-రామ్ జీ' కార్యక్రమం కోసం అవసరమైన సన్నాహాలను పూర్తి చేసుకోవడానికి చాలా రాష్ట్రాలకు గరిష్టంగా ఆరు నెలల సమయం ఉంటుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. జులై 1వ తేదీ నాటికి ఏ రాష్ట్రమైనా అవసరమైన సన్నాహాలను పూర్తి చేయడంలో విఫలమైనప్పటికీ.. జులై 1 తర్వాత చేపట్టే పనులకు సంబంధించిన నిధుల విధానం 'వికసిత్ భారత్ జీ-రామ్ జీ' పథకం నిబంధనల ప్రకారమే వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ పథకం ద్వారా ఉపాధి కల్పించేందుకు భారత ప్రభుత్వం తన బడ్జెట్‌లో రూ. 95,000 కోట్లకు పైగా నిధులను కేటాయించిందని కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ పథకం అమలు కోసం రాష్ట్రాలు కూడా తమ బడ్జెట్‌లలో తగిన నిబంధనలు చేసుకున్నాయని...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కేటాయింపులు కలిపి మొత్తం రూ. 1,51,000 కోట్లకు పైగా ఉంటాయని వివరించారు.

కార్మికులకు చెల్లించే వేతనాల ప్రక్రియపై మంత్రి మాట్లాడుతూ..డబ్బు నేరుగా వారి బ్యాంకు లేదా తపాలా శాఖ ఖాతాల్లోకి జమ చేస్తామని కేంద్రమంత్రి తెలిపారు. వేతనాలను కేవలం మూడు రోజుల్లోనే చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని... అయితే గరిష్టంగా 15 రోజుల్లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేసి నిధులు కార్మికుల ఖాతాల్లోకి చేరాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఒకవేళ 15 రోజులు దాటినప్పటికీ వేతనం అందకపోతే సదరు కార్మికులు ఆలస్య చెల్లింపు పరిహారం పొందేందుకు అర్హులని, చెల్లింపులో జాప్యం జరిగినందుకు అదనపు మొత్తాన్ని కూడా చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమానికి ఈ పథకం ఒక సమగ్ర కవచంలా పనిచేస్తుందని శివరాజ్ సింగ్ చౌహాన్ అభివర్ణించారు. పని కావాలని కోరినప్పుడు ఉపాధి కల్పించలేకపోతే, సదరు కార్మికుడికి తప్పనిసరిగా నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఏటా కేటాయించే రూ. 1.51 లక్షల కోట్ల భారీ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను భారీ ఎత్తున చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ పథకం ద్వారా కేవలం ఉపాధి మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసరమైన మౌలిక వసతుల కల్పన జరుగుతుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి సంరక్షణ పనులు, రోడ్లు, వంతెనలు, కల్వర్టులు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందని వివరించారు. ఉపాధి కల్పన కార్యకలాపాల్లో భాగంగా.. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన పని షెడ్లు వంటి మౌలిక సదుపాయాలను కూడా ఈ పథకం కింద నిర్మించవచ్చని తెలిపారు. ప్రకృతి విపత్తుల ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ పథకం ద్వారా చేపట్టే ప్రత్యేక పనుల గురించి మంత్రి ప్రస్తావించారు. నదీ తీర గ్రామాలు లేదా నీరు నిలిచే ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం వంటి పనులను కూడా ఇందులో చేర్చినట్లు వెల్లడించారు. ఈ పనుల్లో నిమగ్నమయ్యే కార్మికులకు వేతనాలు సకాలంలో, తగిన విధంగా అందేలా చూడటం కోసం పరిపాలనా వ్యయం కేటాయింపును గతంలో ఉన్న 6 శాతం నుంచి 9 శాతానికి పెంచినట్లు ఆయన ప్రకటించారు.

ఇది కార్మికుల జీవితాల్లో నూతన శకానికి నాంది అని కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ తెలిపారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి 'వికసిత్ గ్రామాలు' పునాది అని, ఆ సంకల్పాన్ని నెరవేర్చడంలో ఈ పథకం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 'బిగ్ క్యాట్స్' నివాస స్థల పునరుద్ధరణ, సాంకేతికత ప్రధానమైన పర్యవేక్షణ, సమాజ ఆధారిత సంరక్షణలకు కార్పొరేట్ ఫండింగ్ ఎంతైనా అవసరం: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, మే 12:భారత్ మొదటి ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ సమ్మిట్‌ను జూన్ 1, 2 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనుందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఈ రోజు తెలిపారు. బిగ్ క్యాట్స్ సంరక్షణలో చురుకైన పాత్రను పోషించాల్సిందిగా పరిశ్రమ రంగానికి ఆయన విజ్ఞప్తి చేశారు. 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమ, సమాజ భవిత.. ఇండియాఏ100 దార్శనికత' అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు.




ఈ కార్యక్రమంలో శ్రీ యాదవ్ ప్రసంగిస్తూ, ప్రపంచంలో ఏడు 'బిగ్ క్యాట్స్'.. పులి, సింహం, చీతా, చిరుత పులి, మంచు ప్రాంతాల్లో కనిపించే చిరుత, జాగ్వార్, ప్యూమా సంతతులను కాపాడడానికి ఐబీసీఏ (ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్) కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీసుకు వచ్చారని గుర్తు చేశారు. 'బిగ్ క్యాట్స్' సంరక్షణకు ప్రపంచ వ్యాప్త ప్రయత్నాలకు కార్పొరేట్ ఫండింగ్‌తోనూ, భాగస్వామ్యాల ద్వారానూ మద్దతివ్వాల్సిందిగా పరిశ్రమ రంగ ప్రముఖులను ఆయన కోరారు.

వీటి సంరక్షణలో పరిశ్రమ పాత్ర ముఖ్యమని మంత్రి చెబుతూ, "బిగ్ క్యాట్స్ నివాస స్థలాల పునరుద్ధరణ, సాంకేతికత ప్రధానమైన పర్యవేక్షణ, నిఘా, సమాజ ఆధారిత సంరక్షణ, సామర్థ్యాల పెంపుతో పాటు సంరక్షణ పంమైన చైతన్యాన్ని పెంచడం వంటి కీలక విధులకు కార్పొరేట్ ఫండింగ్ అత్యవసరం" అని పేర్కొన్నారు.

బిగ్ క్యాట్స్‌ను సంరక్షించడానికి అందరూ ముందుకు రావాలని శ్రీ యాదవ్ కోరారు. "వాటి భవిష్యత్తును కాపాడడం అంటే, మనను మనం కాపాడుకోవడమే. దీనికి కారణం అవి అగ్రగామి ప్రిడేటర్లు, 'అంబ్రెల్లా స్పీసీస్' కావడమే. పర్యావరణ సమతౌల్యాన్ని బిగ్ క్యాట్స్ నిలబెడతాయి. జీవవైవిధ్యాన్నీ, జల వనరుల్నీ పరిరక్షిస్తాయి" అని ఆయన అన్నారు. ఐబీసీఏతో ఒక ఎంఓయూను సీఐఐ ఇప్పటికే కుదుర్చుకుందని కూడా మంత్రి తెలిపారు.

'ఇండియాఏ100' విషయంలో భారత్ సాధిస్తున్న పురోగతి, భారత్ దృష్టికోణాల గురించి శ్రీ యాదవ్ వివరిస్తూ, కృత్రిమ మేధ, హరిత సాంకేతికతలు, డిజిటల్ సేవలు ప్రధానంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలు, భౌగోళిక-రాజకీయ మార్పులు, వాతావరణ పరంగా సవాళ్ల నేపథ్యంలో ప్రపంచం ఒక యుగ మార్పునకు సాక్షీభూతంగా నిలుస్తోందన్నారు.

"పలు కోణాల్లో, ఇది ఒక్క యుగ మార్పు మాత్రమే కాదు.. ఇది కాలపు మార్పు కూడా" అని ఆయన వర్ణించారు.

నూతన ఆవిష్కరణలకు సుదృఢత్వాన్నీ, ఆర్థికాభివృద్ధినీ, సుస్థిరత్వాన్నీ మేళవించి గ్లోబల్ లీడర్‌గా రూపొందే స్థితిలో ఉండగలగడం భారత్‌ను ఒక అద్వితీయ స్థానంలో నిలిపిందని మంత్రి అన్నారు. భారత్ ప్రపంచంలోకెల్లా అత్యంత వేగంగా దూసుకుపోతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని ఆయన తెలిపారు. పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ, ప్రజలకు డిజిటల్ మాధ్యమం ద్వారా సేవలను అందించడం, అంకుర సంస్థల పురోగతి, తయారీ రంగం.. ఇలా పలు అంశాల్లో ముందుకు వెళ్తూ ప్రపంచంలో మార్పునకు భారత్ కీలకంగా మారుతోందని ఆయన వివరించారు.

పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేసే స్తోమత పరంగా భారత్ ప్రస్తుతం ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని శ్రీ యాదవ్ తెలిపారు. దేశంలో మొత్తం సౌర సామర్థ్యం 2014లో 2.82 గిగావాట్లు (జీడబ్ల్యూ)గా ఉండగా, 2026 మార్చి నెలాఖరుకల్లా 150 గిగావాట్లకు చేరుకొందన్నారు. భారత్ స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యంలో దాదాపు 50 శాతం ప్రస్తుతం శిలాజేతర ఇంధన వనరుల నుంచే లభిస్తోందనీ, 2030 నాటికి ఈ స్థితికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకొంటే అంత కన్న ముందుగానే దీనిని సాధించారని ఆయన చెప్పారు.

ఉద్గారాల తీవ్రతను 2005, 2020 మధ్య కాలంలో 36 శాతం మేర భారత్ తగ్గించిందని, యూఎన్ఎఫ్‌సీసీసీ, ప్యారిస్ ఒప్పంద ప్రణాళికల్లో భాగంగా తన మొదటి ద్వైవార్షిక పారదర్శకత నివేదికను ఇటీవలే విడుదల చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ నివేదికలో పేర్కొన్న ప్రకారం.. అనుకున్న షెడ్యూలు కన్న ముందుగానే శిలాజేతర ఇంధన సామర్థ్య లక్ష్యాలను భారత్ నెరవేర్చడంతో పాటు తలసరి ఉద్గారాల స్థాయిని నిలబెట్టుకొంటూ, ఉద్గారాల తీవ్రతలో 37.38 శాతం తగ్గింపును సాధించిందని ఆయన తెలిపారు.

'ఇండియాఏ100' మూల స్తంభాలను గురించి శ్రీ యాదవ్ ప్రస్తావిస్తూ ఆర్థిక పరివర్తన, మానవ వనరులు, నైపుణ్య సాధన, సుస్థిర అభివృద్ధి, సామాజిక సమ్మిళితత్వం, ప్రపంచంలో భారత్ భూమిక.. ఇవి 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారే బాటలో భారత్ పయనాన్ని నిర్దేశిస్తాయన్నారు.

"మా దృష్టికోణం స్పష్టంగా ఉంది: అది..అభివృద్ధి చెందుతూ, అన్ని వర్గాలనూ కలుపుకొని ముందుకు పోయే, నూతన దృక్పథం కలిగిన, సుస్థిరమైన, స్వయంసమృద్ధి కలిగిన భారత్‌ను సాకారం చేయడం.. అలా ఆవిర్భవించే భారత్ ద్వారా ప్రపంచ శాంతికి, సమృద్ధికి సార్థక తోడ్పాటును అందించడమే" అని చెబుతూ, ఆయన ప్రసంగాన్ని ముగించారు.

# పరీక్షల్లో ఫెయిల్ అయితే నిరాశ చెందవద్దు..




ఆదిలాబాద్, మే 12:పరీక్షలు జీవితంలో ఒక భాగం అని, ఫలితాలతో నిరాశ చెందవద్దని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు.పదో తరగతిలో ఫెయిల్ అయిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు డివిజన్ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతులకు హాజరైన విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ?పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందకుండా పట్టుదలతో ముందుకు సాగాలని, విఫలం కావడం జీవితం అంతం కాదని, అది కేవలం ఒక దశ మాత్రమేనని ఆయన సూచించారు. విజయం సాధించడానికి అనేక మార్గాలున్నాయని,ఒకసారి ఫెయిల్ అయినంత మాత్రాన తమ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయవద్దని విద్యార్థులకు తెలిపారు.

ఈ సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థుల కొరకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో రెండు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం జెల్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు యాదవ్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, జ్యోతి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నియమాలు పాటించాలి

**-జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డా. బి. రవి రాథోడ్**

ఖమ్మం, మే 12:స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నియమాలు పాటించాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డా. బి. రవి రాథోడ్ అన్నారు మంగళవారం పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నిర్మల్ హాస్పిటల్, గణేష్ స్కానింగ్ సెంటర్, పద్మావతి హాస్పిటల్ సహా పలు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి సిపిఎన్డిటి చట్టం 1994 ప్రకారం స్కానింగ్ సెంటర్ల నిర్వహణకు సంబంధించి గర్భస్థ శిశువు లింగాన్ని స్కానింగ్ సమయంలో గానీ, ఆ తర్వాత గానీ వెల్లడించడం చట్టరీత్యా నేరం.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని అన్నారు.అన్ని స్కానింగ్ గదులు, వెయిటింగ్ హాళ్లలో "ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు'' అనే బోర్డు తప్పనిసరిగా ప్రదర్శించాలని అన్నారు. శిక్షణ పొందిన, సర్టిఫైడ్ రేడియాలజిస్ట్ లేదా గైనకాలజిస్ట్ మాత్రమే గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేయాలని అన్నారు.ప్రతి నెల 5వ తేదీ లోపు ఫారం- ఎఫ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించాలని అదే రోజు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, బయో-మెడికల్ వేస్ట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు, ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరి. అన్ని ధృవపత్రాలను; ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలు, ఫీజుల వివరాలు తెలిపే బోర్డులను ప్రధానంగా ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాల న్నారు.

# తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే మోడీ ఉచిత సలహాలు

**-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

చౌటుప్పల్, మే 11:కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తన విదేశాంగ విధాన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే ప్రజలకు ఉచిత సలహాలు ఇస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం వల్ల దేశంలో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, దీనికి మోదీ అనుసరిస్తున్న తప్పుడు విదేశాంగ విధానమే కారణమన్నారు. రష్యా, ఇరాన్ వంటి మిత్రదేశాలను కాదని, అమెరికా ప్రయోజనాల కోసం మోదీ మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు.




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని జాన్ వెస్లీ ఆరోపించారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణానికే పరిమితమై.. దళితబంధు, రైతుకూలీలకు రూ. 12 వేలు, కౌలు రైతులకు రూ. 12,500, మహిళలకు రూ. 2,500, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం వంటి ప్రధాన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు సామ్రాజ్యవాద దేశాలు చమురు నిల్వలున్న దేశాలపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. అదానీ, అంబానీల వ్యాపార ప్రయోజనాల కోసం 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవాన్ని మోదీ అమెరికాకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పేరుకుపోయిన స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నిర్వహించిన సర్వేలో ప్రతి కుటుంబం అప్పుల ఊబిలో ఉన్నట్లు తేలిందని, పాలకుల నిర్లక్ష్యంపై పోరుబాట పట్టాలని కోరారు. అంతకుముందు సీనియర్ నాయకులు ఎండి పాషా పార్టీ జెండాను ఆవిష్కరించగా, రొడ్డ అంజయ్య చిత్రపటానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, కొండమడుగు నరసింహ, కల్లూరు మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల జయమ్మ, నాయకులు గోశిక కరుణాకర్, గంగాదేవి సైదులు, పల్లె మధు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ భారత్ అంతటా 2026 జులై 1 నుంచి అమలు కానున్న 'వికసిత్ భారత్ - జీ రామ్ జీ' చట్టం

న్యూఢిల్లీ, మే 12:భారత గ్రామీణ ప్రాంతాల అభివ?ద్ధిలో ముఖ్యమైన కార్యక్రమైన 'వికసిత్ భారత్ - రోజ్‌గార్, అజీవికా హామీ మిషన్ (గ్రామీణ్)(వీబీ-జీ రామ్ జీ) చట్టం - 2025'ను దేశవ్యాప్తంగా 2026 జులై 1 నుంచి అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేంకు 2026 మే 11 న నోటిఫై చేసింది.

వీబీ- జీ రామ్ జీ చట్టం అమలులోకి వచ్చిన రోజునే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ)-2005 రద్దవుతుంది. భారత గ్రామీణాభివృద్ధి విధానంలో చరిత్రాత్మక మార్పుగా ఇది నిలుస్తుంది. అలాగే 2047 నాటికి వికసిత్ భారత్ జాతీయ లక్ష్యానికి అనుగుణంగా సమీకృతమైన, భవిష్యత్తు అవసరాలకు తగిన, ఉత్పాదక ఆధారిత గ్రామీణాభివృద్ధి అనే నూతన యుగానికి నాంది పలుకుతుంది.

కొత్త విధానం ప్రకారం, నైపుణ్యం అవసరం లేని శారీరక శ్రమను చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ప్రతి గ్రామీణ కుటుంబంలోని వయోజనులకు ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 పని దినాలకు చట్టబద్ధమైన హామీ లభిస్తుంది. జీవనోపాధి భద్రతను బలోపేతం చేయడం, గ్రామీణ ఆదాయాలను మెరుగుపరచడం, గ్రామస్థాయిలో సుస్థిరాభివృద్ధికి మద్దతు అందించడమే మెరుగుపరిచిన ఈ హామీ లక్ష్యం.

కార్మికుల డిమాండు ఆధారంగా నిర్ణీత గడువులో ఉపాధి లభిస్తుంది. ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం నిరుద్యోగ భృతికి అర్హులవుతారు.

సకాలంలో, పారదర్శకంగా వేతనాల చెల్లింపులకు ఈ చట్టం ప్రాధాన్యమిచ్చింది. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానం ద్వారా కార్మికుల బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాలకు నేరుగా వేతనాలు జమవుతాయి. వారానికోసారి లేదా మస్టర్ రోల్ ముగిసిన పదిహేను రోజుల్లోగా వేతనాలు చెల్లించాలి.

అలా చేయని పక్షంలో చట్టంలోని నిబంధనల ప్రకారం ఆలస్యానికి నష్టపరిహారం పొందేందుకు కార్మికులు అర్హులవుతారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

వరంగల్, మే 11: భూపాలపల్లి జిల్లా బండపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో ఆంజనేయస్వామి దేవాలయాలను ప్రత్యేకంగా రంగురంగు పూలు, పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారినీ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది .భజనలు అన్నదాన కార్యక్రమాలు శోభాయాత్రలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బండపల్లి దేవస్థానం చైర్మన్ పెండ్యాల సమ్మిరెడ్డి కమిటీ సభ్యులు మందల కృష్ణారెడ్డి గ్రామ సర్పంచ్ వ్యాకల లతా రాజు మాజీ సర్పంచ్ నామని రాజేందర్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో కలిగి ఉండాలని తెలిపారు కాగ జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదానంతో గ్రామాలలో భక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# దేశ సమగ్ర అభివృద్ధికి మూలం విద్య

## – ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్




నల్గొండ, మే 12: దేశ సమగ్ర అభివృద్ధికి మూల సాధనం విద్య అని, సరియైన ప్రణాళికతో పరిశోధనలపై దృష్టి సారించి ఉన్నత విద్యాలయాలు మార్గదర్శకంగా ఉండాలని నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం విద్యా వారోత్సవాల్లో భాగంగా ఎంజీయూ ఆధ్వర్యంలో విద్యా విధానంపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శివారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై తెలంగాణ విధానం, జాతీయ విద్యా విధానంపై ప్రసంగించారు. జాతీయ విద్యా విధానం 2020 సమగ్రమైన మార్పులను సూచిస్తుందని, బాల్యం నుండే బలమైన పునాదులుగా విద్యను అందించే ప్రణాళిక, విద్యార్థులు ఐక్యక అంశాలను ఎంచుకునే వెసులుబాటు అందరికీ అందుబాటులో జవాబుదారితనం, నాణ్యత ప్రమాణాలపై సంస్థలు దృష్టి సారించాలన్నారు.తెలంగాణ వార్తలు

విద్యను కేవలం మార్కులు, సర్టిఫికెట్లు, ర్యాంకులు వంటి బాహ్య ప్రమాణాల ఆధారంగా మాత్రమే అంచనా వేయడం సమాజానికి హానికరమన్నారు. విద్య అంతరమ్మాల్యం అంటే జ్ఞానం, విమర్శనాత్మక ఆలోచన, నైతిక బలం, సామాజిక బాధ్యత వంటి అంతర్గత మార్పులుగా పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు విద్యలో బాహ్య విలువల కన్నా అంతర్మూల్యానికి ప్రాధాన్యం ఇచ్చే విధానాలు, పద్ధతులు అమలు చేయాలన్నారు. ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా.వై ప్రశాంతి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీదేవి, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలు-26'ను ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మే 12: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఈ రోజు (2026 మే 12). ఈ సందర్భంగా రాష్ట్రపతి భవన్లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలు-26'ను నర్సింగ్ సిబ్బందికి రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు.

'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలు-26'ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రపతి సందేశాన్ని ఇస్తూ,

"దేశ ప్రజలకు కరుణతో, అచంచల అంకిత భావంతో సేవలను అందిస్తున్న నర్సింగ్ సిబ్బంది, ఆరోగ్య సంరక్షణ వృత్తి నిపుణుల అమూల్య తోడ్పాటును యథోచితంగా గౌరవించుకొనే సందర్భం ఇది. నర్సింగ్ సిబ్బంది సేవలో అత్యున్నత ప్రమాణాలకు ఉదాహరణగా నిలుస్తున్నారు. అంతేకాదు, తరచు అన్నిటి కన్న తీవ్ర సవాళ్లతో కూడిన పరిస్థితుల్లోనూ నాణ్యమైన ఆరోగ్య సేవలను అందజేయడంలో కీలక పాత్రను వారు పోషిస్తున్నారు. పురస్కారాలను గెలుచుకున్న వారిని అందరినీ కర్తవ్యం పట్ల వారు కనబరుస్తున్న స్ఫూర్తిదాయక అంకితభావానికి, అలాగే రోగుల సంరక్షణలో అత్యున్నత ప్రమాణాల్ని పరిరక్షించే దిశగా వారు చేస్తున్న అలుపెరుగని ప్రయత్నాలను నేను అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు.

సమాజానికి నర్సింగ్ సిబ్బంది అందిస్తున్న ప్రతిభావంతమైన సేవలకు గుర్తింపునివ్వడానికి 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాల'ను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 1973లో ఏర్పాటు చేసింది.

పురస్కారాల జాబితాను చూడటానికి దయచేసి ఈ కింది ఇంగ్లిషు వాక్యాన్ని క్లిక్ చేయగలరు

# నర్సుల సేవలు వెలకట్టలేనివి : గుడిపాటి సైదులు




నల్గొండ, మే 12:నిస్వార్థంగా నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని తుంగతుర్తి సింగిల్ విండో ఛైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని ప్రశంసించారు. అనంతరం నర్సులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాలవరపు సంతోష్, గుండగాని రాము, కేదారి, గుడిపూడి లక్ష్మణ్ రావు, గుజ్జ భాస్కర్, వెంకటనారాయణ, శ్రీనివాస్, అభిలాష్, గిరి పాల్గొన్నారు.

# రైతు పంట మిల్లర్లకేనా?

## -మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

నల్గొండ, మే 12: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని భువనగరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బీబీనగర్ మండలంలోని మగ్గంపల్లి, పెద్ద పలుగు తండా, చిన్న రావులపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులుగా ధాన్యం రాశులు అలాగే ఉండిపోవడం, లారీలు రాకపోవడం, మిల్లర్లు ధాన్యం ఎత్తకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల పక్షాన నిలవాల్సిన అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎ గ్రేడ్ గా ధృవీకరించిన ధాన్యాన్ని మిల్లర్లు బీ గ్రేడ్‌గా చూపిస్తూ ధరలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు తమకు వాపోయినట్లు పేర్కొన్నారు.

మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే భారీ ధర్నాలు

ధాన్యం తడిస్తే కట్ చేయాలనే ఉద్దేశంతోనే ఎత్తివేత ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆవేదన



వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పేరుకుపోయినా లారీలు ఎందుకు రావడం లేదో, మిల్లర్లు ఎందుకు ధాన్యం ఎత్తడం లేదో అధికారులు సమీక్షించడం లేదన్నారు. రైతు పంటను అమ్ముకునే సమయంలోనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారంలో యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలపై మాత్రం స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఫోన్లు చేసినా స్పందించడం లేదని, కొనుగోలు కేంద్రాల పరిస్థితిని పరిశీలించేందుకు కూడా రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరించి ధాన్యం ఎత్తివేయకపోతే మండల కేంద్రాల్లోని ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట భారీ ధర్నాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మిల్లుల వద్ద గత 10 రోజులుగా లారీలు వేచి ఉన్నా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవట్లేదని, కటింగుల పేరుతో రైతులను నిలువు దోచేస్తున్నారని అన్నారు. ఏ గ్రేడ్‌ను బీ గ్రేడ్‌గా మార్చడమే కాకుండా ప్రతి బస్తాకు 42 కిలోలే తూకం వేసి మిగిలిన ధాన్యాన్ని కటింగుల పేరుతో రైతులను మోసంచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్ గౌడ్, రైతు బంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ బొక్క జైపాల్ రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి, నయకులు పిట్టల అశోక్, అమృతం శివకుమార్, పంజాల సతీష్ గౌడ్, కొంతం లింగెయ్యగౌడ్, ఎర శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వాటర్ మిలన్ తిని బాలుడు మృతి.. మరో ముగ్గురు చిన్నారులు ఆస్పత్రిపాలు

న్యూఢిల్లీ, మే 12:చతీస్‌గఢ్‌లో విషాదం జరిగింది. వాటర్ మిలన్ తిన్న 15 ఏళ్ల బాలుడు మరణించాడు. మరో ముగ్గురు చిన్నారులు ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన జంజ్‌గిర్-చంపా జిల్లాలోని ఘుర్‌కోట్ గ్రామంలో సోమవారం జరిగింది. అధికారుల వివరాల ప్రకారం.. కొంతమంది పిల్లలు కుటుంబంతో కలిసి తమ అమ్మమ్మ వాళ్లింటికి వచ్చింది.

ఆదివారం సాయంత్రం వాళు ఇంట్లో ఉన్న వాటర్ మిలన్ తిన్నారు. కొద్దిసేపట్లోనే వాటర్ మిలన్ తిన్న పిల్లలకు వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. ఆ వెంటనే శ్వాస సంబంధిత సమస్యలు ఎదురయ్యాయి. అందులో అఖిలేష్ దివార్ (15) తీవ్ర అనారోగ్య సమస్యని ఎదుర్కొన్నాడు. వెంటనే ఆ బాలుడిని కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మిగతా ముగ్గురు పిల్లలు శ్రీ దివార్ (4), పింటూ దివార్ (12), హితేష్ దివార్ (13) కూడా ఇవే సమస్యలు ఎదుర్కొన్నారు. వెంటనే వీరిని కూడా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే, వీరిలో అఖిలేష్.. ఆస్పత్రికి వెళ్లేలోపే ప్రాణాలు కోల్పోయారని వైద్యులు తెలిపారు.

కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వాటర్ మిలన్ ఉదయం కోశారు. ఆ రోజు సాయంత్రం తిన్నారు. ఈ క్రమంలో ఆ వాటర్ మిలన్ విషతుల్యం అయ్యుండొచ్చని అనుమానిస్తున్నారు. మరణించిన బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పిల్లలు తిన్న వాటర్ మిలన్ శాంపిల్స్‌ను అధికారులు సేకరించారు. అలాగే, కొయ్యకుండా ఉంచిన ఇంకో వాటర్ మిలన్‌ను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం చిన్నారులకు వైద్య చికిత్స కొనసాగుతోంది.

# వైఫల్యం నుండే విజయం మొదలు : డీఈఓ బి.నాగలక్ష్మి



ఖమ్మం, మే 12: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని విద్యార్థులు బాధ పడవద్దని, ఫెయిల్యూర్ నుంచే సక్సెస్ సాధించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి అన్నారు. పాల్వంచలోని బొల్లూరుగూడెం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని (రెమెడియల్ క్యాంప్) మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాల్వంచ పట్టణ, మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 109 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలో ఫెయిల్ అయ్యారని, వారికోసం ప్రభుత్వం 12వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు (రెమెడియల్ క్యాంపు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులకు హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని తిరిగి మళ్లీ పరీక్షలు రాసి పాసై రెగ్యులర్ విద్యార్థులు మాదిరిగా తిరిగి ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. ఫెయిల్ అయ్యామని బాధపడుతూ ఇంట్లోనే కూర్చోకుండా ఇప్పుడు వచ్చిన ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు అంతా కూడా పేద తరగతికి చెందినవారు అయినందువల్ల తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను అడియాశలు చేయకుండా ఉన్నత శిఖరాలకు ఎదిగేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఏ.శ్రీరామ్మూర్తి, నోడల్ అధికారి బి.ప్రకాశరావు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు సునందిని, కుమారి, మంగమ్మ, పద్మలత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# సీఎం అనాలోచిత నిర్ణయంతో లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరం : శ్రీనివాస్‌గౌడ్



కాచిగూడ,మే 12: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, సీఎం అనాలోచిత ధోరణితో లక్షలాది మంది విద్యార్థులు చదువు దూరమవుతున్నారని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వం జీఓ నెంబర్-7ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాచిగూడలో మంగళవారం తెలంగాణ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జీఓ కాపీలను మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ చించివేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ నెంబర్-7ను విరమించుకోకపోతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల 50 వేల మంది విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్ ఆధారపడి చదువుతున్నారని, రూ.10 వేల కోట్ల పైగా బకాయిలు ఉండడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఆరోపించారు. తెలంగాణలో 17 మంది విద్యార్థులు చనిపోయిన ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ, ఉదయ్, నందగోపాల్,రవీందర్, మాణిక్, తికల్‌సింగ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో తేమ, తరుగు పేరుతో జరిగే మోసాన్ని అరికట్టాలి : సునితాలక్ష్మారెడ్డి




మెదక్, మే 12: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ, తరుగు పేరుతో రెండు కిలోలకు పైగా అదనంగా తీసుకుంటున్నారని, దీన్ని వెంటనే నిలిపియాలని ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని జాతీయ రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం లారీల సమస్య, హమాలీల సమస్యను వెంటనే పరిష్కరించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు.

అలాగే శివంపేట మండలం చిన్న గొట్టిముక్కల చౌరస్తా వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రైతులను బుజ్జిగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

ఖమ్మం, మే 12:ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో జీపీఏఐ పథకం ద్వారా మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల బీమా చెక్కును బూర్గంపహాడ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ నాగరాజు మంగళవారం అందజేశారు. బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన సోడె నరేష్ బ్యాంకులో ఖాతాతో పాటు ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ జీపీఏఐ పథకంలో బీమా తీసుకున్నాడు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నామినీగా ఉన్న సోడె గోపయ్యకు బీమా నగదు రూ.20 లక్షల చెక్కును బ్యాంకు అధికారులు అందజేశారు.తెలంగాణ వార్తలు

ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ జీవితంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో ఎవరికీ తెలియదని, అలాంటి సమయంలో కుటుంబానికి అండగా నిలిచేది బీమా పథకాలేనని అన్నారు. చిన్నమొత్తంలో ప్రీమియం చెల్లించుకుంటే పెద్ద మొత్తంలో కుటుంబానికి భరోసా లభిస్తుందన్నారు.

## ఎదురెదురుగా ఢీకొన్న లారీలు.. ఇద్దరు సజీవ దహనం

తిరుమలాయపాలెం, మే 12 : ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని మేకలతండా వద్ద ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓ లారీలో బొగ్గు లోడు ఉండడంతో మంటలు చెలరేగి ఓ లారీ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి సజీవ దహనం అయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

